వాల్మీకి మహర్షికి ఘన నివాళులు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ఆధ్యాత్మిక జ్ఞాని, తాత్వికుడు మహర్షి వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి జయంతిని పురస్కరించు కొని కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం వాల్మీకి మహర్షి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ డా.అభిషేక్ గౌడ్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ బి. పద్మావతి పూలమల్లలు వేసి నివాళులర్పించారు. ఐటీడీఏ కార్యాలయంలో ఐటిడిఏ పిఓ, వి.అభిషేక్ , సహాయ ప్రాజెక్ట్ అధికారులు వి.ఎస్ ప్రభాకర్ రావు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం రాజు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు. మానవ జీవితానికి అనువైన విధంగా వాల్మీకి రామాయణాన్ని రచించి ఎన్నో విషయాలపై మహత్తర సందేశాన్ని అందించారని గుర్తు చేశారు. కారణ జన్ముడిగా నిలిచిన ఆయన రామాయణం నిలిచినంత కాలం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, ఐటీడీఏ అకౌంట్ అధికారి శ్రీనివాస్ కుమార్, ఐటిడిఏ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : స్థానిక ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో వాల్మీకి మహర్షి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఏ అప్పలస్వామి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రచించిన రామాయణం రచనలు గురించి మాట్లాడారు. అలాగే ఆయన జీవన విశిష్టత, ఉన్నతిని వివరించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బయ్యప్పరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ డి వెంకటేష్ బాబు, పి. జోగారావు, పాలిటెక్నిక్ విద్యార్థినీ విద్యార్థులు మరియు పరిశోధన స్థానం నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంబి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : పల్లే పండుగ కార్యక్రమంలో భాగంగా ఖం డ్రుమ్ పంచాయితీ ఓంబి గ్రామంలో డబ్ల్యూ బి ఏం రోడ్డు నిర్మాణ పనులను టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్.దోన్ను దొర గురువారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు సౌకర్యం లేని మారుమూల గ్రామంలో రోడ్డు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, పార్టీ మండల అధ్యక్షుడు టి సుబ్బారావు, టిఎన్టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం స్వామి, జనసేన టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎలుగు దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : మండలంలోని పిత్తగుడ గ్రామంలో జరిగిన ఎలుగుబంటి దాడిలో ఇద్దరు గిరిజనులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి వివరాలు ఆ గ్రామానికి చెందిన కిల్లో. లక్ష్మి , కీల్లో కేశవరావు గ్రామానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలోని కాఫీ తోటల పనుల నిమిత్తం గురువారం ఉదయం వెళ్లారు. అకస్మాత్తుగా ఎలుగుబంటి దాడి చేయడంతో వారిద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో ఈ విషయాన్ని తెలుసుకున్న వారి కుటుంబీకులు హుటాహుటిన అంబులెన్స్ లో దుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్య సేవలు అందించి అరకులోయ ప్రాంతీయ హాస్పిటల్ కు తరలించినట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు.

విద్యుత్‌కు అంతరాయం... రోజంతా పవర్ కట్

మూగబోయిన చరవాణి, అంతర్జాల సేవలు

అధికారుల నిర్లక్ష్యమే విద్యుత్ అంతరాయానికి కారణం అంటున్న వినియోగదారులు

విశాలాంధ్ర-చింతపల్లి : మన్య ప్రాంతంలో చిన్నపాటి వర్షానికి, చిరుగాలులకు సైతం విద్యుత్ అంతరాయం ఏర్పడడం పరిపాటి. అటువంటిది ఎటువంటి గాలులు లేకుండానే గురువారం ఉదయం ఏర్పడిన విద్యుత్ అంతరాయం రాత్రి ఆరు గంటల వరకు పవర్ కట్ ను తలపించింది. ఎక్కడ ఎటువంటి అంతరాయం ఏర్పడిందో అర్థం కాని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ లేక సతమతమయ్యారు. ప్రస్తుతం ప్రతి ఇంట నీటి మోటార్లు, ప్రభుత్వ కార్యాలయాలలో అంతర్జాల సేవలు, ప్రతి ఒక్కరి చేతిలో చరవాణి లు ఉన్నప్పటికీ విద్యుత్ అంతరాయం వలన గురువారం అవన్నీ మూగబోయాయి. ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. విద్యుత్ అంతరాయాన్ని పరిష్కరించవలసిన ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు సైతం తమకేమీ పట్టదు అన్నట్లు మిన్నకున్నారు. దీంతో విద్యుత్ వినియోగదారులంతా విద్యుత్ కు ఎక్కడ సమస్య తలెత్తిందో అర్థం కాక ఇబ్బంది పడ్డారు. సమస్యలు ఏర్పడితే స్పందించవలసిన సంబంధిత శాఖ అధికారులు, ఉద్యోగులు ఆ సమస్యలపై స్పందించకపోవడం వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయని విద్యుత్ వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

వలిసే పంటపై దుచ్చరపాలెం రైతులకు అవగాహన

విశాలాంధ్ర-జీకే వీధి : మండలంలోని రంతాడ పంచాయతీ సచివాలయం-2 పరిధి దుచ్చరపాలెం గ్రామంలోని గ్రామ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గిరిజన ఉప ప్రణాళిక లో 2024-25 సంవత్సరానికి గాను చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానము అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ అప్పలస్వామి మరియు శాస్త్రవేత్తలు బయ్యపురెడ్డి,బాల హుస్సేన్ రెడ్డి రైతులకు వలిసెల పంట పై రైతులకు శిక్షణ నిర్వహించి మెలుకులను తెలియజేయడం జరిగింది.రైతులకు నైజర్ విత్తనాలు పంపిణీ చేసి రైతులకు అధిక దిగుబడి వచ్చేందుకు అనేక సలహాలు సూచనలు మరియు పంటపై తెగులుపై మేలుకువలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మధుసూదన్ రావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ సంగీత గ్రామస్తులు జోగిపడాల్, భీమేశ్వర పడాల్, గోపి, రాము, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ కలెక్టర్ సందర్శన

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: గిరిజన కాఫీ ఘుమఘుమలు అద్భుతంగా ఉన్నాయని కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ అన్నారు. మండలంలోని గెద్దం పుట్టు గ్రామంలో ఉన్న మన్య తోరణం రైతు ఉత్పత్తి దారుల కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ను గురువారం సందర్శించారు. కాఫీ పళ్ల సేకరణ, పల్పింగ్, క్యూరింగ్, రోస్టింగ్, గ్రైండింగ్, కాఫీ పొడరు తయారీ, కాఫీ డికాక్షన్ తయారు, కాఫీ కలుపుకునే విధానాన్ని పరిశీలించారు. అనంతరం కాఫీ కమ్మదనాన్ని రుచి చూసి తయారీ దారులను అభినందించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల కార్యక్రమాలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాఫీ మార్కెటింగ్ విస్తరణకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గిరిజన కాఫీని విస్తరించడానికి ప్రమోట్ చేయడానికి 50 మంది గిరిజన యువకులకు శిక్షణ అందించాలని అన్నారు. కాఫీ ఉత్పత్తదారులకు ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేస్తామని అన్నారు. కాఫీ రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. గిరిజన రైతులు పూర్తిగా పక్వానికి వచ్చిన కాఫీ పళ్లను మాత్రమే సేకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ బోర్డు ఉప సంచాలకులు సమాల రమేష్ మన్యతోరణం రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధి దూరు వెంకట రమణ, తుంపాడ, గెద్దంపుట్టు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో గృహ నిర్మాణ పనులు వేగవంతం

అరకు గృహనిర్మాణ శాఖ డిఈ రాజుబాబు

విశాలాంధ్ర-అరకులోయ : అరకులోయ మండలంలో ప్రధానమంత్రి జన్మన్ యోజన పథకం గృహ నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి, సుంకరమెట్ట పంచాయతీలో సంఘం, దాబుగూడ, పెద్దగంగగుడి పిరిబందా గ్రామంలో అరకు డివిజన్ గృహ నిర్మాణం డి ఈ. రాజుబాబు, అరకులోయ ఏఈ శెట్టి కాంతి గ్రామంలో సందర్శించి లబ్ధిదారులకు గృహ నిర్మాణం వేగవంతం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ డిఈ, రాజుబాబు మాట్లాడుతూ సుంకరమెట్ట పంచాయతీలో సంఘం వలస గ్రామంలో సందర్శించామని, గృహ నిర్మాణం లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నాం అన్నారు.గృహ నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. అరకులోయ మండల వ్యాప్తంగా నూతనంగా 2166 గృహాలు మంజూరయ్యాయని, మొదటి విడత 1404 గృహాలు నిర్మాణం పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అలాగే రెండవ విడత కింద 762 గృహ నిర్మాణాలు పనులు నిర్మాణాలు చేపట నున్నట్లు ఆయన తెలియ జేశారు. నిరుపేద గిరిజనులకు ప్రభుత్వం ప్రధానమంత్రి జన్మన్ యోజన పథకం ప్రవేశపెట్టిందని, ఒక గృహ నిర్మాణానికి 2లక్ష 39 వేల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, గృహ నిర్మాణం చేపట్టిన మొదటి వారం రోజుల్లోనే బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. మంజూరైన ప్రతి ఒక లబ్ధిదారులు నూతన గృహ నిర్మాణాలు ప్రారంభించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పి వి టీ జి లకు ప్రభుత్వం ప్రధానమంత్రి జన్మన్ యోజన పథకం గృహ నిర్మాణాలు మంజూరు చేస్తుందని, మంజూరైన గృహాలకు నిర్మాణం అవకాశాలను ఉపయోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ శెట్టి కాంతి, ఈఏ.మజ్జి నాగేశ్వరరావు. సుంకర్ మెట్ట సర్పంచ్ చిన్నబాబు, గ్రామస్తులు గృహ నిర్మాణ వినియోగదారులు,

ప్రతి ఏడాది పర్యాటక వారోత్సవాలు

రెండు, మూడు రోజులపాటు ఉత్సవాలు

విశాలాంధ్ర-రంపచోడవరం : పాడేరు, రంపచోడవరం డివిజన్లలో రానున్న పర్యాటక సీజన్ లో ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలలో పర్యాటక వారోత్సవాల పేరుతో రెండు మూడు రోజులు ఉత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. తద్వారా ఏజన్సీలోని, ఇతర రాష్ట్రాల గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు, వివిధ వస్తువల అమ్మకాల స్టాల్స్, వినోద కార్యక్రమాలు, అడ్వంచర్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డిసెంబర్ మొదటి వారంలో ముందుగా అరకు ఫెస్టివల్ నిర్వహణకు ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు. ఈ ఉత్సవాల ద్వారా ప్రపంచ దృష్టిని ఆకర్షించాలని, రానున్న పదేళ్ళలో జాతీయ స్థాయి ఉత్సవాలుగా అభివృద్ధి జరగాలని సూచించారు. గురువారం కలెక్టర్ చాంబర్ లో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పాడేరు డివిజన్లో పది, రంపచోడవరం డివిజన్లో ఐదు ముఖ్యమైన పర్యాటక కేంద్రాలు గుర్తించి అన్ని మౌలిక సదుపాయాలూ కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పర్యాటకుల వాహనాల పార్కింగ్, వసతి, రవాణా సౌకర్యం, ఆహార పదార్థాల స్టాల్స్, త్రాగు నీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ లాంటి ఇతర సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రంపచోడవరం డివిజన్లో గల గుడిసె పర్యాటక కేంద్రం చెత్త చెదారాలతో నిండి పర్యాటకులకు అనువుగా లేకుండా పాడైపోయిందని రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి, అటవీ శాఖాధికారి పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. అదేవిధంగా వంజంగి ప్రాంతాన్ని పాడేరు ఐటిడిఏ పిఒ పరిశీలించాలని ఆదేశించారు.

ప్రైవేట్ వాహనాల దందాకు చెక్ : గుడిస, కటిక జలపాతం, తదితర కొన్ని పర్యాటక ప్రాంతాలకు స్వంత వాహనాలను అనుమతించకుండా వారు ఏర్పాటు చేసిన వాహనాలలోనే వెళ్లాలని సమస్యలు సృష్టిస్తూ అధిక వసూళ్లు చేపడుతున్నారని, దానిని కట్టడి చేయాల్సి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. అటువంటి ప్రైవేట్ వాహనాలకు చెక్ పెట్టేవిధంగా కమిటీ నిర్ణీత రుసుమును స్థిరీకరించి ఆ రుసుముకే పర్యాటకులను తీసుకు వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ డా. ఎం.జే అభిషేక్ గౌడ్, పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రామ సభలో పంచాయతీ అభివృద్ధిపై సమీక్ష

విశాలాంధ్ర-జీకే విధి : గూడెం కొత్త వీధి పంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ సుభద్ర ఆధ్వర్యంలో గ్రామసభలో ఏర్పాటు చేయడం జరిగింది. పంచాయతీలో పలు గ్రామంలో అభివృద్ధి పనులపై సమీక్షించి తీర్మానించడం జరిగిందిని. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు, పల్లె పండుగ కార్యక్రమం ద్వారా, పంచాయతీల అభివృద్ధికి, ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంద న్నారు,. ఈ కార్యక్రమంలో జనసేన మండల బూత్ కన్వీనర్ గడుతూరి పరమేశ్వరరావు, నాడేల సత్యారావు, ముట్టడం వెంకటేష్ ముక్కల మహేష్, కళ్యాణి, బొంజి బాబు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాహన రికార్డులు తప్పనిసరి : సిఐ

విశాలాంధ్ర-అనంతగిరి : వాహనదారులు వాహన రికార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని అరకు సీఐ హిమగిరి సూచించారు. మండలంలోని ములియగుడ వద్ద అనంతగిరి ఎస్ఐ డి.శ్రీనివాసరావుతో కలిసి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. లైసెన్స్లు లేకపోతే వాహనాలు సీజ్ చేస్తామని, మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఐటిడిఏ గ్రీవెన్స్‌కు కలెక్టర్

విశాలాంధ్ర-సీతంపేట : ఈనెల 21వ తేదీన (సోమవారం) సీతంపేట, ఐటిడిఏలో నిర్వహించే లిప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పార్వతీపురం మన్యం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గారు హాజరుకానున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు ఐటిడిఏలోని ఎస్.ఆర్. శంకరన్ మీటింగ్ హాల్లో ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమా నికి సీతంపేట, ఐటిడిఏ పరిధిలోని గిరిజన ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్‌కి వినతులు సమర్పించుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా కార్యక్రమానికి ఐటిడిఏకు సంబంధించిన అన్ని శాఖల డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఐటిడిఏ పీవో ఆదేశించారు.

ఉల్లాస్ లక్ష్యాలను సాధించాలి : కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ఉల్లాస్" కార్యక్రమం కింద ఇచ్చిన లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వయోజన విద్య నోడల్ అధికారిని ఆదేశించారు. గురువారం నాడు వయోజన విద్యాశాఖ అధికారులతో సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. జిల్లాలో 23 వేలమంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. ఇందుకోసం మండల, జిల్లా స్థాయిలో నోడల్ అధికారులని నియమించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇచ్చిన లక్ష్యాలలో అన్ని మండలాలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని సూచించారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రచురించబడే పుస్తకాలు మండల, జిల్లాస్థాయిలో సరఫరా చేయబడతాయని, అందులోని పాఠాలను నిరక్షరాస్యులకు బోధించి, ప్రాథమిక అవగాహన పెంచాలని కలెక్టర్ హితవు పలికారు. జిల్లాలో 53శాతంగా ఉన్న అక్షరాస్యత, ఈకార్యక్రమంద్వారా మరింత పెరగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమం ద్వారా అవగాహన పెంచుకున్న వారందరికీ చివరి రోజున సర్టిఫికెట్, పతకాలువంటివి బహూకరించి ప్రోత్సాహించాలన్నారు. జిల్లాలో నిర్దేశించిన ఉల్లాస్ కార్యక్రమ లక్ష్యాలు సాధించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈసమావేశంలో వయోజన విద్య నోడల్ అధికారి టి.వైకుంఠరావు, డిఆర్డిఎ, డ్వామా పీడీలు వై. సత్యంనాయుడు, కె.రామచంద్రరావు, సీడీపిఓ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

మండలంలో ఏనుగుల గుంపు

విశాలాంధ్ర-సీతానగరం : గత వారంరోజుల నుండి ఏనుగులగుంపు మండలంలోని సూరంపేట, తాన్నసీతారాంపురం, గుచ్చిమి గ్రామాల పరిధిలో సంచరిస్తూ తిష్టవేసిఉన్నాయి. పగలంతా తోటల్లో ఉండి రాత్రిపూట పంట భూములను నాశనం చేస్తున్నాయని రైతులు తెలియజేస్తున్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీసు, అటవీ, పశు వైద్యాధికారులు, మండల అధికారులు తెలియజేస్తున్నారు. ఏనుగులను కవ్వించవద్దని కోరారు. మండలంలో ఎప్పుడు లేనివిధంగా వారం రోజులుపాటు ఏనుగులు గుంపు ఉండడం గమనార్హం.

ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలు వేసవి సెలవుల్లో మాత్రమే నిర్వహించాలి

ఎపిటిఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-బెలగాం : విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయులకు యిచ్చే వృత్తంతర శిక్షణలు విద్యాభివృద్ధిని కుంటుపరుస్తాయనీ కావున ప్రస్తుతం 1, 2 తరగతులకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు తిరుపతి కేంద్రంగా రెసిడెన్షియల్ శిక్షణ నిర్వహించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్రావు మహేష్, నల్లా బాలకృష్ణ తెలిపారు. వీటిని వెంటనే రద్దు చేసి కేవలం వేసవి సెలవుల్లో డివిజన్ లేదా మండల స్థాయిలో నిర్వహించాలని లేదా ఆన్లైన్ మాత్యమం ద్వారా గానీ నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. 1, 2 తరగతులను బోధించే ఉపాధ్యాయులకు ఈనెల 21వ తేదీ నుండి 26వ తేదీ వరకు ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ప్రారంభించి సుమారు 13 విడతలుగా డిసెంబరు నెలాఖరు వరకు నిర్వహించనున్నట్లు సమాచారం అందిన ప్రాప్తికి ఈవిధంగా స్పందిచినట్లు తెలిపారు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రతీ జిల్లా నుండి ఎంపిక చేసిన రిసోర్స్ పర్సన్‌లకు ముందుగా శిక్షణ ఇచ్చి, వారి ద్వారా ప్రతి మండలాల్లో గాని లేదా రెండు మూడు మండలాలకు కలిపి గాని శిక్షణ ఇవ్వవలసిందిగా కోరుతున్నట్లు తెలిపారు.

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహణ

విశాలాంధ్ర-పార్వతీపురం : మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక, జిల్లా రెవిన్యూ అధికారి జి.కేశవనాయుడు, సహాయ బి.సి.సంక్షేమ అధికారి ఇ.అప్పన్న, ఇతర అధికారులు భాగస్వాములై వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు.

పార్వతీపురం : జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి నివాళులు అర్పించారు. వాల్మీకి మహర్షి భారతీయ ఇతిహాస కావ్యమైన రామాయణంను రచించిన మహారచయితన్నారు. ఆశ్రమాలలో జ్ఞాన సంపదను నేర్చుకొని, భావితరాల వారికి ఆదర్శప్రాయముగా ఉండేవిధంగా మహాకావ్యాన్ని రచించిన మహా పండితుడన్నారు.మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధురకావ్యం రామాయణంమని, యుగాలు మారినా కూడా ఆయన రాసిన రామాయణం మానవ జీవితాలను ప్రభావితం చేస్తుందన్నారు.ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ డా., ఓ.దిలీప్ కిరణ్, ఏఆర్ డిఎస్పీ ఎస్.వెంకట అప్పారావు, ఆర్ఐలు శ్రీరాములు, శ్రీనివాసరావు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, జిల్లా ఆర్మడ్, స్పెషల్ బ్రాంచ్, డి.సి.ఆర్.బి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకలవ్య ఆదర్శ పాఠశాలను పీఓ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-మక్కువ : మక్కువ మండలం అనసభద్రలోని ఏకలవ్య ఆదర్శ వసతి పాఠశాలను పార్వతీపురం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. వంట గదిని తనిఖీ చేసి, ఆహార నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యా ప్రమాణాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్న ఆయన విద్యార్థులకు అందించే భోజన సదుపాయాలు, నాణ్యత ప్రమాణాలు, మెనూ ప్రకారం అందిస్తున్న ఆహారం గురించి ఆరా తీశారు. మంచి విద్య, ఆహారం అందిస్తున్నట్లు విద్యార్థులు తెలియ జేయడంతో పిఓ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అదే గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఆహార నాణ్యత ప్రమాణాలను స్వయంగా పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ పర్యటనలో గిరిజన సంక్షేమ అధికారులు, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

21న పార్వతీపురంలో మెగా జాబ్ మేలా : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : ఈనెల 21వ తేదీన పార్వతీపురం శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు కలెక్టర్ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ,ఎం.బి.ఎ చదువుకుని 18 నుండి 30 సం.లు ఉన్నటువంటి నిరుద్యోగ యువతీ యువకులు అక్టోబర్ 21తేదీన అనగా సోమవారం ఉదయం 9.00 గం.ల నుంచి శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కలాశాల, పార్వతీపురంనందు మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ జాబ్ మేళాలో 18 కంపెనీల ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను స్కిల్ యూనివర్సిటీ ఏపీ ఎస్ ఎస్ డి సి వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటు బయో డేటా,ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్,ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో హాజరు కావలసినదిగా కోరారు. మరిన్ని వివరములకు 6305110947, 8978878557 నందు సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



విశాలాంధ్ర-సీతంపేట : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కొరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం పల్లె పండుగ. ఈ కార్యక్రమంలో భాగంగా సీతంపేట మండల పరిధిలో మహాత్మగాంధీ జాతీయ ఉపాది హామీ నిధులతో పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ ఆదేశాల మేరకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఐటీడీపీ పి కోఆర్డినేటర్ హిమరక పవన్, కుమార్ మరియు సర్పంచ్, సచివాలయం సిబ్బందులు, గ్రామస్తులు పాల్గొడం జరిగింది. ఉప్పర జమ్మి గ్రామం వద్ద పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించడం జరిగింది నిర్వహించారు.

ఘాట్‌రోడ్డులో బైక్ అదుపు తప్పి కానిస్టేబుల్ మృతి

విశాలాంధ్ర-కురుపాం : మండలంలోని జరడ-నీలకంతంపురం ఘాట్ రోడ్డులో బైక్ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో ఏ.ఆర్ కానిస్టేబుల్ కోట్ల బుల్లిబాబు అక్కడికక్కడే మృతి చెందారు. గురువారం హిరమండలం నుండి ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్ కు విధులు నిర్వహించడానికి వెళు తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడు స్వగ్రామం పాలకొండ సమీపంలో గొట్టా మంగళవారం కాగా హిరమండలంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం : ఎంపీడీఓ

విశాలాంధ్ర-సీతానగరం : పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా అన్నిగ్రామాల్లో నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు గ్రామాల్లో ఇంకుడు గుంతలు నిర్మాణానికి శంకుస్థాపనలు, ట్రెంచ్ కటింగ్, గోకులాలు నిర్మాణానికి శంకుస్థాపనలు చేయడం జరుగుతుందని ఎంపీడీవో త్రివిక్రమరావు తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్దేశించిన విధముగా అన్ని గ్రామపంచాయతీల్లో వారంరోజులపాటు కార్యక్రమాలను ముమ్మరంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉద్యోగస్తులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలు గ్రామాల్లో జరుగుతున్న శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే విజయ్ చంద్ర కూడా పాల్గొంటున్నారని తెలిపారు. మండల స్థాయి గ్రామస్థాయి ప్రజాప్రతినిధులుకు పల్లె పండగ వారోత్సవాలుపై పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారధ్యంలో పల్లె పండుగ వారోత్సవాల ద్వారా కొన్ని పనులకు శంకుస్థాపనలు చేయడమేకాక ఆయా గ్రామాల్లో సమస్యలను కూడా పరిష్కరించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు.

లొంగుపర్తి పంచాయతీ సిపిఎం కార్యదర్శిగా జన్ని భీమన్నదొర

విశాలాంధ్ర-అనంతగిరి : లంగుపర్తి పంచాయతీ సీపీఎం శాఖ కార్యదర్శిగా జన్ని భీమన్న దొర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు గురువారం లంగుపర్తి పంచాయతీ శాఖ 3వ మహాసభ జన్ని సుబ్బారావు అధ్యక్షతన జరిగింది మహాసభ కు హాజరైన సీపీఎం మండల కార్యదర్శి సోమెల నాగులు మాట్లాడుతూ లంగుపర్తి పంచాయతీ వెలగలపాడు నుండి వంతెన గరువు ఎర్రమెట్టు నేల పాలెం గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు పోడు సాగు రైతులకు ఫారెస్టు పోడు పట్టాలు మంజూరు చేయాలని కోరారు గిరిజనులు పక్షాన పోరాటం చేసేది సీపీఎం పార్టీయే నని అన్నారు భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు అనంతరం సీపీఎం నాయకులు కిల్లో మోస్య వారి సమక్షంలో లంగుపర్తి నూతన శాఖ కార్యదర్శిగా జన్ని భీమన్న దొర ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈకార్యక్రమంలో పార్టీ సభ్యులు సుబ్బారావు జె అప్పారావు మామిడి దేముడు మామిడి రామన్న శివాజీ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: గర్భిణీలు, ఐదేళ్లలోపు పిల్లలు, కిశోర బాలికల్లో రక్తహీనత లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సీడిపిఓలను ఆదేశించారు. రక్తహీనత నివారణ పట్ల ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు.అవసరమైతే ప్రభుత్వం అనుమతి పొందిన ఇంజక్షన్లు కూడా ఇప్పిస్తామని కలెక్టర్ చెప్పారు. ప్రతి గర్భిణీకి ఒక కార్డు ఇవ్వాలని, ఆమె క్రమం తప్పకుండా తీసుకుంటున్న వాటిని ఆ కార్డు నందు నమోదు చేయాలన్నారు.గర్భిణీలు రక్తహీనతతో ప్రాణాపాయ పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత సీడిపిఓలదేనని కలెక్టర్ తేల్చిచెప్పారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించడంతో పాటు, వయసుకు తగిన బరువు,ఎత్తు పెరిగేలా చూడాల్సిన బాధ్యత కూడా సంబంధిత సీడిపిఓలదేనని కలెక్టర్ వివరించారు. పిల్లల్లో వయసుకు తగిన బరువు, ఎత్తు ఉండాలని,అందుకు తగిన పోషక ఆహారాన్ని అందించాలని అన్నారు.ఇందుకు పాలు, ఆకుకూరలు, గుడ్లు,చెక్కీలు వంటివి తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఇందుకు అవసరమైన సహాయ సహకారాలు జిల్లా యంత్రాంగం తరపున అందిస్తామని, అప్పటికీ ఫలితాలు కనిపించక పోతే సంబంధిత సీడీపీఓలపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. పిల్లల ఆరోగ్యం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద వ్యవస్థను నడుపుతోందని, ఇందుకు అధికారులు కూడా సాయశక్తుల కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు. పిల్లల్లో బరువు, ఎత్తు, కొలతలను ప్రతివారం రిజిస్టరులో నమోదు చేయాలని, బరువు,ఎత్తు తక్కువగా ఉన్న వారికి డబుల్ మిల్క్, ఎగ్స్ ఇవ్వాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. పుట్టిన పిల్లాడు తల్లి తర్వాత చేరేది అంగన్వాడీ కేంద్రానికేనని, అటువంటి కేంద్రాలు అందంగా, ఆకర్షనీయంగా కనిపించాలన్నారు. ఇందుకోసం బాగాలేని కేంద్రాలకు వైట్ వాష్ వేయించాలని, గోడలకు చిత్ర లేఖనం వేయించాలని అన్నారు. పిల్లలందరూ హాజరయ్యేలా చూడాలని, వారు హాజరైనట్లుగా హాజరుపట్టీలో నమోదు కావాలని చెప్పారు. హాజరైన పిల్లలకు తగిన పోషకాహారం, విద్యను అందించడంతో పాటు, ఇతర కార్యక్రమాలపై అవగాహన పెంచాలని అన్నారు. ముఖ్యంగా భోజనం ముందు, తదుపరి చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, కేంద్రానికి వచ్చే ముందు శుభ్రంగా తయారై రావడం, క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవ మర్యాదలు వంటివి నేర్పాలని అన్నారు. నెలలో మూడో శనివారం రోజున ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టాలని చెప్పారు. అందుబాటులో ఉన్న స్థలాభావాన్ని బట్టి ఆకు, కూరగాయలు వంటివి పండించాలని చెప్పారు. వాటిని ఆహారంలోకి వినియోగించాలని సీడీపీఓ లను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి ఎం.ఎస్.రాణి, అన్నిమండలాల సీడిపిఓలు, సూపర్ వైజర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోగా శ్రీనివాస్ విశ్వనాథ్ బాధ్యతలు

విశాలాంధ్ర - మారేడుమిల్లి : మారేడుమిల్లి మండల నూతన ఎంపీడీవోగా తూటిక శ్రీనివాస్ విశ్వనాథ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈయన ప్రస్తుతం పశ్చిమగోదావరి ఏలూరు డిపిఓ(ఎఫ్ఎసి) గా పనిచేసి మారేడుమిల్లి ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. గతంలో ఎంపీడీవోగా పనిచేసిన ఏ. వీరకిషోర్ వైయస్సార్ జిల్లాకి బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా ఎంపీడీవో తూటిక శ్రీనివాస్ విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ప్రజలకు ఏమైనాసమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-మారేడుమిల్లి : స్థానిక మండల కేంద్రం స్తూపం సెంటర్ వద్ద మారేడుమిల్లి మండల వాల్మీకి యూత్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల వాల్మీకి అధ్యక్షులు గొర్లె అనుదీప్ కుమార్, మాజీ ఎంపిటిసి గొర్లె అనిల్ ప్రసాద్ మాట్లాడుతూ ఆదివాసి ల ఆరాధ్య దైవం, సంస్కృతంలో ఆదికవి, రామాయణాన్ని రచించిన వ్యక్తిగాప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ నల్లమిల్లి సుబ్బారెడ్డి, ఆటో యూనియన్ సభ్యులు కంభం విజయ్ వాల్మీకి, బి.మురళి, ముత్తు, ప్రసాద్, వాల్మీకి యూత్ సభ్యులు దూడ బ్రహ్మాజీ, గొర్లె సువర్ణరాజు, కంభం లోకేష్, తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో తూటిక శ్రీనివాస్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఎంపీడీవో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రచించిన రామాయణం మహాగ్రంథం ఇతిహాసాల్లో ఒకటి అంతటి మహా గ్రంథాన్ని భారతీయులకు అందించిన మహానుభావుడు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ విజయ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిడిఏ ఆధ్వర్యంలో...

చింతూరు : చింతూరు ఐటిడిఏ పిఓ అపూర్వ భరత్ ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పి ఒ వాల్మీకి చిత్రపటానికి పూలదండ వేసి అతను రచించిన రామాయణం విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : ఐటిడిఎలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని ఐటిడిఎ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా పీవో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పీవో మాట్లాడుతూ వాల్మీకి మహర్షి ప్రపంచ ఆదికవి అని, రామాయణాన్ని రాసిన గొప్ప కవి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జి.చిన్నబాబు, ఏఎంవో కోటిబాబు, సీఎంవో చిరంజీవులు, జీసీడీవో రాములమ్మ, జీసీసీ మేనేజర్లు నర్సింహులు, క్రిష్ణ, ఉపాధిహామీ ఏపీడి శ్రీహరి, ఇతర ఐటిడిఎ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : మండలంలోని పలు గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా బర్రిమామిడి, గంగవరం గ్రామాల్లో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ. కృష్ణారెడ్డి, జడ్పీటీసీ బేబీరత్నం. మండలవాల్మీకి అధ్యక్షుడు. గొర్లె రాజుబాబు, పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వై.రామవరం : తహసీల్దార్ కార్యాలయం లో నూతన తహసీల్దార్ వేణుగోపాల్ గురువారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిపారు.వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పి.ఎఱ్ఱగొండా గురుకుల కళాశాలలో..

వై.రామవరం మండలం పి.ఎర్ర గొండ గురుకుల కళాశాల లో ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ ఆద్వర్యం లో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిపారు.వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతున్న ప్రభుత్వ పథకాలు

- లబ్ధిదారులకు అందని ప్రభుత్వ కందిపప్పు
- డీలర్ల వద్ద గగ్గోలు పెడుతున్న ప్రజలు
- డీడీలు తీశాము... సరుకు రాలేదంటున్న డీలర్లు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ప్రస్తుత రోజుల్లో సామాన్యుల జీవన సరలి చాలా ఖరీదుతో కూడుకున్న పరిస్థితి నెలకొంటుంది. సామాన్యులకు అందుబాటులో ఉండవలసిన నిత్యవసర సరుకులు ధరలు రోజురోజుకు ఆకాశాన్ని అంటుతున్నాయి. వంటనూనె, పప్పులు,టమోటా తదితర నిత్యవసర వస్తువులను సామాన్య ప్రజలు కొనుక్కొనే పరిస్థితిలో లేరు. ఈ విషయాన్ని గమనించిన ప్రభుత్వం ప్రభుత్వ చౌక ధరల దుకాణాల ద్వారా పంచదార, కందిపప్పు బియ్యం తక్కువ ధరలకే ఇవ్వటం జరుగుతుందని ప్రచారం చేసింది.అలాగే టమాట రైతు బజార్ ద్వారా రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఒక కిలో టమాట తక్కువ ధరకే అందించడం జరుగుతుందని, ప్రత్యేక కౌంటర్ల ద్వారా వంట నూనెను కూడా మార్కెట్ రేటు కన్నా తక్కువకు అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు ఆయాశాఖ మంత్రి కూడా ప్రచారాలు చేస్తూ ప్రజలకు ఊదర కొట్టిస్తున్నారే తప్ప సామాన్య ప్రజలకు మాత్రం నిత్యవసర సరుకులను అందించడంలో విఫలమవుతున్నారని చెప్పక తప్పదు. పార్వతీపురం మున్సిపాలిటీలో 30 వార్డుల పరిధిలో 30 ప్రజా చౌక ధరల డిపోలు ఉన్నాయి.ఈ 30 డిపోలలో ఒక్కో డిపోకి 200 నుంచి 500 రేషన్ కార్డుల వరకు లబ్ధిదారులు ఉన్నారు.ఇటీవల ప్రభుత్వం చౌక ధరల ద్వారా పంచదారను, కందిపప్పును తక్కువ ధరకు అందిస్తామని ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆనందం నెలకొంది. కానీ పలు డిపోలలోగల లబ్ధిదారులకు కందిపప్పు పూర్తిస్థాయిలో అందక డీలర్ల వద్ద ప్రజల గగ్గోలు పెడుతున్నారు.బయట మార్కెట్లో కిలో కందిపప్పు 120 నుంచి 130 రూపాయలు పలుకుతుండటంతో చౌక ధరల డిపో ద్వారా కేజీ కందిపప్పును ప్రభుత్వం 67 రూపాయలకే ఇస్తున్న విషయం అందరికి తెలిసిందే.అయితే పట్టణంలోని ఏ డిపోలో కూడా పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు కందిపప్పు అందడం లేదన్న విషయం వాస్తవం.200 కార్డులో ఉన్న డిపోలో 100 నుంచి 120 మంది వరకే ఇప్పటివరకు డీలర్లు కందిపప్పు సరఫరా చేశారు. కందిపప్పు అందని లబ్ధిదారులు డీలర్ల వద్ద తగాదాలు పడే పరిస్థితి కూడా నెలకొంటుంది. ప్రభుత్వం ఇస్తున్న కందిపప్పును డీలర్లు ఎందుకు ప్రజలకు ఇవ్వడం లేదని డీలర్లను పలువురు ప్రశ్నించగా రేషన్ డిపో కి పూర్తిస్థాయిలో సరిపడా కందిపప్పును ప్రభుత్వం సరఫరా చేయలేదని సుమారు 50 నుంచి 60 శాతం వరకు సరఫరా అయిన కందిపప్పును పంపిణీ చేయడం జరిగిందని, మిగిలిన కందిపప్పుకు ప్రభుత్వానికి డీడీలు తీసినప్పటికీ నేటికీ సరుకు అందని కారణంగా లబ్ధిదారులకు ఇవ్వలేని పరిస్థితి నెలకొంటుందని డీలర్లు సమాధానం ఇస్తున్నారు. పంచదార విషయానికొస్తే అరకేజీ 17 రూపాయలకు ప్రభుత్వం అందిస్తుంది కానీ ఇందులో 50 గ్రాముల వరకు తరుగు వస్తుందని బయట మార్కెట్లో నాణ్యత గల పంచదార కిలో 38 రూపాయలకే లభిస్తుందని దీనివలన ప్రజలకు నష్టమే తప్ప లాభం లేదని పలువురు

ఆరోపిస్తున్నారు. అలాగే టమాటా, వంట నూనెను ప్రత్యేక కౌంటర్ల ద్వారా తక్కువ ధరలకు అందిస్తామని ప్రభుత్వం ఆర్భాటం చేసిందే తప్ప పూర్తిస్థాయిలో సామాన్య ప్రజలకు ఈ సరుకులను అందించడంలో ప్రభుత్వం విఫలమైందని పట్టణంలో పలువురు ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా సామాన్య ప్రజలకు నిత్యావసర సరుకులను తక్కువ ధరలో అందించడంలో ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలే చేసింది తప్ప ప్రజలకు మాత్రం వాటిని అందించడంలో విఫలమైందని స్థానిక ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే సకాలంలో లబ్ధిదారులందరికీ రేషన్ డిపో ద్వారా నిత్యవసర సరుకులను పంపిణీ చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

చరవాణి అధిక వాడకం విద్యార్థులకూ శాపం

డా. నగేష్ రెడ్డి, డా. సుకుమార్ బాబు

విశాలాంధ్ర-బెలగాం : నయనం ప్రధానం అన్న సూక్తితో వాటికి ఎనలేని ప్రాధాన్యం ఉంది. కంటిచూపు బాగుంటేనే ప్రపంచంలో దేనినైనా సాధించగలం. అయితే ప్రస్తుతం చరవాణి హవా సాగుతుండడం వలన పిల్లల్లోనూ దృష్టి లోపాలు అధికంగా వున్నట్లు రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న పాఠశాల విద్యార్థుల ఐ స్క్రీనింగ్ కార్యక్రమంలో వెల్లడైంది. ఆగస్టు 1వ తేది నుండి ప్రారంభమైన ఈ కంటి పరీక్షల కార్యక్రమం అక్టోబర్ 31వ తేదీ వరకు జరగనున్నాయి. రాష్ట్ర అందత్వ నివారణ సంస్థ ఆదేశాలమేరకు జిల్లా అందత్వ నివారణ సంస్థ మరియు జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా ఆప్తల్మిక్ అధికారులు, ఆప్తలమిక్ సహాయకులు బృందాలుగా ఏర్పడి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

నేత్ర పరీక్షలు పూర్తి చేసిన 264 పాఠశాలలు, పరీక్షలు చేసుకున్న విద్యార్థులు-51,115, కళ్లజోళ్లు అవసరమైన విద్యార్థులు-1734, ఉన్నత శ్రేణి చికిత్సల కోసం రెఫరల్ విద్యార్థులు-16.

కరోనా సమయంలో బడులకు సెలవులు ఇవ్వడం, ఆన్లైన్ తరగతులు నిర్వహించడం, పిల్లలు చరవాణి ఉపయోగం అధికమవ్వడం, ఇంటికి చేరిన తరువాత గేమ్ లు, రీల్స్, సినిమాలు చూడడానికి చరవాణినే వినియోగిస్తున్నారు. ఎక్కువ సమయం సెల్ ఫోన్ స్క్రీన్ చూడటం వల్ల అధికంగా దృష్టి దోషాలు వస్తున్నట్లు గుర్తించారు. ఇంకా మరికొందరు తల్లిదండ్రులే పిల్లల చేతికి చరవాణిలు ఇవ్వడం, పిల్లల ఏడుపును మానిపించడానికి సైతం చరవాణిని చూపడం అధిక వినియోగం దృష్టి లోపానికి ప్రధాన కారణం. గంటల తరబడి చరవాణి వాడకం మరోవైపు పోషకాహారం తీసుకోకపోవడం కారణంగా దాని ఫలితం కళ్ళపై తీవ్రప్రభావం వలన కంటి చూపు దెబ్బతింటోంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం బడిపిల్లలకు కంటిపరీక్షలు నిర్వహించి దృష్టి లోపాలు వున్నవారికి కళ్లజోళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. సమస్య ఎక్కువగా వున్నవారికి శస్త్ర చికిత్సలు చేయించాలనేది ప్రభుత్వ లక్ష్యం. తల్లిదండ్రులు సైతం పిల్లలపై దృష్టిసారించి చరవాణి వినియోగం అత్యవసరమైతేనే ఉపయోగించేలా, పౌష్టికాహారం అందించి వైద్యుల సూచనలు పాటించి దృష్టి దోషాన్ని నివారించుకోవాలని సూచిస్తున్నారు. మన్యం జిల్లాలో జరుగుతున్న పాఠశాల విద్యార్థుల నేత్ర పరీక్షల కార్యక్రమం ప్రభుత్వ మరియు ఎయిడెడ్ పాఠశాలల్లో అక్టోబర్ నెలాఖరు వరకు నిర్వహించి మెల్లకన్ను మరియు అంతరకుసుమం (గాయాలవలన వచ్చే) వున్నవారిని గుర్తించి మెరుగైన శస్త్ర చికత్సలతో కంటిచూపును మెరుగుపరచడానికి సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రులలో నిర్వహిస్తామని, అలాగే సాధారణ వ్యాధులకు చికిత్సలు అందిస్తున్నామని జిల్లా అందత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి డా. జీరు నగేష్ రెడ్డి తెలిపారు. జిల్లాలో జరుగుతున్న పాఠశాల విద్యార్థుల కంటిపరీక్షలు త్వరితగతిన పూర్తిచేసి విద్యార్థులలో అందత్వాన్ని నివారించడమే ప్రభుత్వ లక్ష్యంగా అద్దాలు అవసరమైన వారికి ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా అందత్వ నివారణ అధికారి డా. సుకుమార్ బాబు తెలిపారు.

మొదటిరోజు శిక్షణ తరగతులు దిగ్విజయం

ప్రజాప్రతినిధులకు శిక్షణా తరగతులు అవసరం

జడ్పిటిసి పోతురాజు బాలయ్య, ఎంపీడీవో ఆశాజ్యోతి

విశాలాంధ్ర-చింతపల్లి : శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని పంచాయతీలలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని జడ్పిటిసి పోతురాజు బాలయ్య అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ తరగతులను ఎంపీడీవో ఆశాజ్యోతి, ఈఓపిఆర్డి శ్రీనివాసరావులతో కలసి గురువారం ఆయన లాంచనంగా ప్రారంభించారు. పంచాయతీ ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణా తరగతులలో భాగంగా మొదటి రోజైన గురువారం వివిధ పంచాయతీలకు చెందిన ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణ తరగతుల నిర్దేశించి ఆయన మాట్లాడుతూ గురు, శుక్రవారాలలో నిర్వహించనున్న రీ ప్రెసర్, ఎలక్టెడ్ రిప్రజెంటేటివ్స్, ఫంక్షనరీస్ శిక్షణా తరగతులు ప్రజా ప్రతినిధులకు ఎంతో ఉపయోగకరమన్నారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల నుంచి ప్రతి పంచాయతికి ఒక ఉప సర్పంచ్, ఇద్దరు వార్డ్ సభ్యుల చొప్పున నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులకు మొదటి రోజైన గురువారం మంచి స్పందన వచ్చిందన్నారు. ఇటువంటి శిక్షణా తరగతులను అప్పుడప్పుడు నిర్వహించుకోవడం ద్వారా ప్రజావసరాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పంచాయతీల ఉపసర్పంచ్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ విద్యుత్ శాఖ తీరుపై సభ్యులు ఆగ్రహం

సిబ్బంది పనితీరు మెరుగుపర్చుకోవాలి

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలో విద్యుత్ శాఖ తీరుపై సర్పంచులు, ఎంపీటీసీలు అగ్రహం వ్యక్తం చేయగా తీరును మార్చుకోవాలని ఎంపిపి బలగ రవనమ్మ, ఎంపిడిఒ పాండ్రంకి త్రివిక్రమరావులు సూచించారు.గురువారం ఎంపిపి బలగ రవనమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా మండలానికి కొత్తగా విచ్చేసిన ఎంపీడీఓ పాండ్రంకి త్రివిక్రమరావు, తహశీల్దార్ ప్రసన్నకుమార్లు పరిచయం చేసుకున్నారు. ఈసమావేశంలో రామవరం సర్పంచ్, మండల టీడీపీ అధ్యక్షుడు పెంట సత్యంనాయుడు ఏఈ జగన్మోహనరావు తీరుపై మండిపడ్డారు. సర్వసభ్య సమావేశంలో మాటలేతప్ప చేతలు లేవని విరుచుకుపడ్డారు. దీంతో చినభోగిలి, బక్కుపేట,కృష్ణరయపురం, ఇప్పలవలస, అంటిపేట, చెల్లంనాయుడివలస, బూర్జ, అంటిపేట, లచ్చయ్యపేట, బక్కుపేట తదితర గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు విద్యుత్ శాఖ అధికారులు, గ్రామాల్లో సచివాలయం విద్యుత్ సిబ్బంది పనితీరు మెరుగుపరచు కావాలని కోరారు. గ్రామాల్లో పెద్దఎత్తున వైర్లు వేలాడి ఉంటున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారని వారువాపోయారు. ఆశించిన విధముగా విద్యుత్ శాఖలో సేవలు అందడం లేదని సభ్యులంతా వాపోయారు. గ్రామ సచివాలయ స్థాయిలో విద్యుత్ శాఖ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలు నిర్మూలించడానికి ప్రయత్నం చేయాలని ఎంపీపీ, ఎంపీడీఓలు సూచించారు. మండలంలోని 35గ్రామ పంచాయతీలకు 25 మినీగోకులాలు మంజూరు కావడంతో దీన్ని గమనించి రైతులందరికీ అవసరమైన గోకులాలు మంజూరు చేసేలా తీర్మానం చేయాలని సభ్యులు తెలిపారు. దీన్ని జిల్లా అధికారుకారులకు తెలియజేస్తానని పశువైద్యులు రామారావు తెలిపారు. సూరంపేట, గుచ్చిమి, తాన్నసీతారాంపురం గ్రామాల్లో ఏనుగులు గుంపు ఉన్నందున ప్రజలు రైతులు అప్రమత్తంగా వాటిని కవ్వించవద్దని సూచించారు. వైద్యశాఖపైన పెదంకలం, సీతానగరం పిహెచ్సీల నుంచి సిహెచ్ఓ సూర్యనారాయణ,డాక్టర్ పావనిలు వివరించగా, వ్యవసాయశాఖలో ఖరీఫ్, రబీ పంట, ధాన్యం కొనుగోలుకేంద్రాలు ఏర్పాటు, వరిలోవస్తున్న తెగుళ్ళు, నివారణ చర్యలు గూర్చి ఏఓ ఎస్ అవినాష్,హౌసింగ్ పైన ఏఈ జానకి రామ్, పంచాయతీరాజ్ పై మండల ఇంజనీరింగ్ అధికారి చంద్రమౌళి, ఆర్డబ్ల్యూఎస్ పై జేఈ పవన్, విద్యాశాఖపై ఎంఈఓలు సూరిదేముడు, వెంకటరమణ, ఎక్సైజ్ గూర్చి ఎస్ఐ షరీఫ్,ఇరిగేషన్ గూర్చి ఏఈ శ్రీనివాసరావు, ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేస్తున్న పనులను ఏపీఓ భాను, వెలుగుపథకాలుగూర్చి ఏపిఎం శ్రీరాములు నాయుడులు తెలిపారు. రెవిన్యూ కార్యక్రమాలపై, భూసమస్యల పైన, మ్యూ టేషన్, రీసర్వే తదితర అంశాల పైన తహసిల్దార్ ప్రసన్నకుమార్ వివరించారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యక్రమాలు గూర్చి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె పండుగ గూర్చి, ప్రభుత్వ అమలుచేస్తున్న పథకాల గూర్చి ఎంపీడీఓ త్రివిక్రమరావు తెలిపారు. రానున్న సర్వసభ్య సమావేశాలకు వచ్చే అధికారులు సభ్యులు అడిగిన ప్రశ్నలకు తగురీతిలో సమాధానాలు ఇవ్వడమే గాక పరిష్కారం చేయాలని సూచించారు. సర్వసభ్య సమావేశాలు చాలా కీలకమైన విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. ఈసర్వసభ్య సమావేశంలో జడ్పిటిసి మామిడి బాబ్జి, ఎంపీపీ ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, పలుశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సురేష్,జూనియర్ అసిస్టెంట్ రామినాయుడు, టైపిస్ట్ ప్రసాద్లు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విఫలం

ప్రజా పోరుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చిన సిపిఎం పార్టీ నాయకుడు చిన్నయ్య పడాల్

విశాలాంధ్ర - చింతపల్లి: ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం చెందిందని, కనుక ప్రజా పోరుకు సిద్ధం కావాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. చింతపల్లి, జీకే విధి, కొయ్యూరు, మూడు మండలాల పార్టీ కార్యదర్శుల సమావేశం గురువారం చింతపల్లి సిపిఎం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ఎన్నికల్లో ధరలు నియంత్రిస్తామన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నేడు అధికారంలోకి వచ్చాక మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. పెరిగిన ధరలను నియంత్రించకుండా కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ, పేద, మధ్యతరగతి ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నారని మండిపడ్డారు. కూరగాయల నుంచి ప్రజలు నిత్యం వాడుకునే అన్ని వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయని, ఆ ధరలను నియంత్రించడంలో విఫలం చెందిన ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలలో ధరల నియంత్రణపై సిపిఎం పార్టీ ప్రచారం నిర్వహిస్తుందని, తద్వారా ప్రజలను ఐక్యం చేసి ప్రజా పోరుబాట నిర్వహిస్తామన్నారు, పల్లె పండగలంటే ప్రభుత్వం నుండి ఇచ్చేది కాదని, ప్రజలు కొనుగోలు చేసే వస్తువుల ధరలు తగ్గించడమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్, కొయ్యూరు మండల కార్యదర్శి, ఎస్ సూరిబాబు, జీకే వీధి కార్యదర్శి అంపురంగి బుజ్జిబాబులు పాల్గొన్నారు.

పట్టపగలే ఇసుక అక్రమ రవాణా... పట్టించుకోని అధికారులు

పాచిపెంట మండల పసుపునేత కనుసన్నల్లో ఇసుక దందా

విశాలాంధ్ర-సాలూరు: సాలూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాలకు పట్టపగలే అడ్డూ, అదుపు లేకుండా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. పాచిపెంట మండలం పాంచాలి గ్రామానికి చెందిన పసుపు నేత తనకున్న ట్రాక్టర్లతో నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు దర్జాగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నాడు. నియోజకవర్గంలో ప్రభుత్వ పరంగా ఎటువంటి ఇసుక రీచ్ లు లేవు. దీనిని ఆసరాగా తీసుకొని ధనార్జనే ధ్యేయంగా పాంచాలికి చెందిన నాయకుడు ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్నాడు. పట్టపగలే సాలూరు పట్టణం నడిబొడ్డున ఉన్న తహశీల్దారు కార్యాలయం దాటుకుంటూ ఇసుకను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా రెవెన్యూ అధికారులు చూసి చూడనట్టు వదిలేస్తున్నారు. అదేమంటే అధికార పార్టీ వ్యక్తి అని నర్మగర్భంగా చెబుతున్నారని తెలుస్తుంది. ఇదే విషయమై పలుమార్లు పత్రికలలో వార్తలు ప్రచురితం అయినప్పటికి తూతూమంత్రంగా చర్యలు చేపట్టడంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డు లేకుండా పోయింది. ఇసుక దందా చేస్తున్న సదరు వ్యక్తికి రాజకీయ అండదండలు పుష్కలంగా ఉండటంతో అధికారులు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మంగళవారం సదరు నాయకుడి అనుచరుడికి చెందిన ట్రాక్టరులో ఇసుకను సాలూరు టౌన్ గుండా తరలిస్తుండగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆలీషా పట్టుకొని కార్యాలయానికి తీసుకువచ్చారు. తరువాత ఏం జరిగిందో, ఎవరు ఒత్తిడి చేశారో అదేరోజు రెవెన్యూ కార్యాలయంలో ఉన్న ట్రాక్టరును దర్జాగా తీసుకొని వెళ్లారు. ఈ విషయంపై తహశీల్దారు చర్యలు తీసుకోకుండా తాత్సారం చేస్తున్నారని దీనివెనక రాజకీయ ప్రమేయం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. అంతేకాకుండా రాజకీయ ఒత్తిడితోపాటు ఇంకేదో జరిగి ఉంటుందని అంతా గుసగుసలాడుకుంటున్నారు. పాచిపెంట మండలానికి చెందిన సదరు టిడిపి నాయకుడు తన మండలంతో పాటు సాలూరు పట్టణం, సాలూరు మండలానికి ఇసుకను రవాణా చేస్తూ సొమ్ము చేసుకోవడాన్ని చూస్తున్న ఆ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులే ముక్కున వేలేసుకుంటూ లో లోపల మధన పడుతున్నారని చెప్పవచ్చు. ప్రభుత్వం సూచించిన ఇసుక రీచ్ సాలూరు నుండి సుమారు 100 కిలోమీటర్ల దూరం ఉండటంతో అక్కడ నుండి ఇసుక తెప్పించేందుకు రవాణా చార్జీలు అధికమవుతాయి. దానితో అధికారికంగా ప్రభుత్వం సూచించిన రీచ్ నుండి ఇసుక తెచ్చుకునే పరిస్థితి దాదాపు లేదనే చెప్పుకోవాలి. దీనిని ఆసరగా తీసుకున్న పాంచాలి నాయకుడు తనకున్న రాజకీయ అండదండలతో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ రవాణా నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

గంగవరం ఎంపీడీవోగా రామకృష్ణ

విశాలాంధ్ర-గంగవరం : గంగవరం మండలం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.జి .రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన శ్రీనివాసులు ప్రకాశం జిల్లా బదిలీ కాగా దేవీపట్నం మండలం పంచాయతీ రాజ్ విస్తరణ అధికారి రామకృష్ణను ఇన్చార్జ్ ఎంపిడిఓ గా నియమించారు. దీంతో ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందే విధంగా కృషి చేస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను కార్యాలయ పరిపాలన అధికారి సిద్దేశ్వర రావు ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, పంచాయతీరాజ్ విస్తరణ అధికారి నర్సింగరావు స్వాగతం పలికారు.

గాడ నిద్రలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ : సిపిఎం

విశాలాంధ్ర-సీతంపేట: మండలం మర్రిపాడు, పూతికవలస, ఈత మనుగూడ పంచాయతీల పరిధిలో 36 గిరిజన గ్రామాల ప్రజలురహదారి సమస్యతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వంకు గాని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ గాని చీమ కుట్టి నట్టు కూడా లేదని సీపీఎం జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు ఎం. తిరుపతిరావు, మండల కార్య దర్శి ఏ. భాస్కర్ రావు విమర్శలు చేసారు. 600 మంది విద్యార్థి నిలు చదువు కుంటున్న ఆశ్రమ పాఠశాల కు నిత్యం వారి తల్లి దండ్రులు రాకపోకలు కు మరియు నీలకంఠపురం ప్రాంతం ప్రజలు రాకపోకలు కు ఇబ్బందులు ఎదురు కుంటున్నారు. ఐటీడీ కు ఇచ్చిన పిర్యాదు లు బుట్ట దాకాలు తప్ప ఎటువంటి చెర్యలు లేవు కనీసం గుంత లైన పూడ్చి న పని లేదు. పంచాయతీ రాజ్ శాఖ నిద్రా వస్తలో వున్నది. సమస్య లు తెలుసు కునేందు నెల రోజులు కూడా ఐటీడీఏ ప్రాజెక్ట్ అది కారులు ఉండడం లేదు. వెంటనే రోడ్ పనులు చే పట్టక పోతే ఆందోళన చెప్పడతామని సిపిఎం పార్టీ నాయకులు అన్నారు.

ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర-చింతూరు : ఎర్రంపేటలోని కస్తూరిబా ఆశ్రమ పాఠశాలలో గురువారం ఆరోగ్యభారతి సంస్థ ఆధ్వర్యంలో 80 మంది బాలికలకు నూతన డ్రెస్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఆరోగ్య భారతి కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ, ఆవుల సుబ్బారావు, సమరసత సేవా ఫౌండేషన్ పద్మావతి, చింతూరు సేవాభారతి వైద్యులు డాక్టర్ గంగాధర్ ప్రసాద్ పాల్గొన్నారు.

128 మందికి నేత్ర వైద్య తనిఖీలు

విశాలాంధ్ర-వీరఘట్టం : మండలం వండువ గ్రామ జంక్షన్ వద్దగల శ్రీ షిరిడి సాయిబాబా జ్ఞాన మందిరంలో గురువారం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో నేత్ర వైద్యాధికారి బి వివేక్ వర్మ 128 మందికి నేత్ర వైద్య తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 97 మందిని ఎంపిక చేసి నేత్ర చికిత్సల కొరకు విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. పార్వతిపురం మన్యం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్యాంపు జూనియర్ మేనేజర్ సిహెచ్ వెంకటరమణ, క్యాంపు కోఆర్డినేటర్ సిహెచ్ సతీష్, ఆలయ ధర్మకర్త ఎం సింహాచలం, నేత్ర రోగులు పాల్గొన్నారు. సుదీర ప్రాంతాల నుండి వచ్చిన వారికి భోజన సదుపాయం కల్పించారు.

క్షయ వ్యాధిపై అవగాహన

విశాలాంధ్ర-హుకుంపేట : మండలంలోని స్థానిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల పెదగరువు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో వైద్యాధికారి డాక్టర్ మోహన్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి ప్రాణాంతక వ్యాధి కాదని భయపడకుండా మందులు వాడటం డాక్టర్ యొక్క సలహాలు రోగని నివారించవచ్చని ఆయన అన్నారు. పిల్లలకు ఎవరైతే రెండు వారానికి మించిన దగ్గుతో పాటు కపం, పడటం, రాత్రిపూట జ్వరం రావడం ఆకలి ముందుకించటం మెడపై పెద్దకాయల్లాగా ఉన్నట్లయితే వెంటనే దగ్గర్లో ఉన్న వైద్యాధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొండమ్మ, వైద్య సిబ్బంది పి హెచ్ ఎన్ జమ్మి, టీబి సూపర్వైజర్ సదానందం ఎంఎల్ హెచ్పి రమ్య ప్రియ, ఎఎన్ఎం సుజాత, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా గౌరీ పౌర్ణమి వేడుకలు

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని పలు గ్రామాల్లో గౌరీపౌర్ణమి వేడుకలు బుధవారం రాత్రి నుండి ప్రారంభంకాగా గురువారం పెద్దఎత్తున భక్తులు పాల్గొని పూజలు చేశారు. శ్రీశ్రీశ్రీ గౌరీదేవీ నందీశ్వర మహోత్సవాలు అన్ని గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మండలంలోని సీతానగరం, అప్పయ్యపేట, మరిపివలస, తామరఖండి, గాదెలవలస తదితర గ్రామాల్లో నందెన్న ఉత్సవాలు జరుగుతున్నాయి.

నూతన తహసీల్దార్‌గా వేణుగోపాల్

విశాలాంధ్ర-వై.రామవరం : వై.రామవరం మండలం నూతన తహసీల్దార్‌గా వి.వేణుగోపాల్ నియమితులయ్యారు. ఆయన ఎటపాక మండలంలో తహశీల్దార్‌గా పనిచేసి ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇంతవరకు పనిచేసిన తహశీల్దార్ అనసూయ కు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు.

అక్రమంగా విద్యుత్ తీగలు అమరిస్తే కఠిన చర్యలు : సీఐ

విశాలాంధ్ర-ఎటపాక : అక్రమంగా విద్యుత్ తీగలు అమరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎటపాక సీఐ కన్నప్ప రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అటవీశాఖ భూముల్లోను, వ్యవసాయ క్షేత్రాల్లోను, జన సంచార ప్రదేశాల్లో ఎవరైనా అక్రమంగా, అనధికారికంగా విద్యుత్ తీగలు అమర్చి జంతువులకు, మానవులకి హాని కలిగిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

తేనెటీగల పెంపకానికి మన్య ప్రాంతం అనుకూలం

- శిక్షణ పొందేందుకు సుదూర ప్రాంతం వెళ్లలేని గిరిజనులు
- అనుకూల మన్య ప్రాంతంలోనే శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయాలి
- జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో అధికారులను కోరిన జెడ్పీటీసీ

విశాలాంధ్ర-చింతపల్లి : మన్య ప్రాంతంలో అనుకూలమైన తేనెటీగల పెంపకం ద్వారా గిరిజనులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా ఉద్యానవన అధికారుల ద్వారా పాడేరు ఐటిడిఏ ఉపాధి అవకాశాలు కల్పించాలని జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహించాలని అధికారులను కోరమన్నారు. అదే క్రమంలో ఈ మధ్యకాలంలో తుఫాను కారణంగా నష్ట పోయిన రైతులు, గిరిజనులకు పరిహారం చెల్లింపుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం చెల్లింపులు చేసినట్లు అధికారులు తెలిపారన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తేనెటీగల పెంపకానికి గిరిజన ప్రాంతం అనుకూలమనీ తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహించాలని ఉద్యాన వనాల అధికారులను కోరడం జరిగిందన్నారు. తేనెటీగల పెంపకం వలన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. అధికారులు స్పందించి ఉత్సాహం ఉన్న అభ్యర్థులు ఆరు రోజులు స్వంత ఖర్చులతో ఏలూరు దరి విజయ రాయి గ్రామంలోని శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందాలని సూచించగా స్పందించిన జడ్పిటిసి ఆర్థికంగా వెనుకబడిన గిరిజనులు సుదూర ప్రాంతమైన ఏలూరు వెళ్ళి శిక్షణ పొందడం కష్టమని, దీనిపై పాడేరు ఐటిడిఏ స్పందించి అనుకూలంగా ఉన్న మన్య ప్రాంతంలోనే (చింతపల్లి, పాడేరు, అరకు లలో ఎక్కడైనా) శిక్షణా కేంద్రం ఏర్పాటు చేసినట్లయితే ఎక్కువ మంది గిరిజనులు శిక్షణ పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో ఐటిడిఏ అన్నీ సౌకర్యాలు కల్పించాలని కోరారు. శిక్షణానంతరం ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు ఐటిడిఏ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మూడవ స్థాయి సంఘం అధ్యక్షులు దొండా రాంబాబు, డిప్యూటీ సిఇఓ, వ్యవసాయ, అటవీ శాఖ, ఉద్యానవన శాఖ, సెరీకల్చర్ సాకలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారన్నారు.

సంకల్పం కార్యక్రమంపై విద్యార్థినులకు అవగాహన

విశాలాంధ్ర-హుకుంపేట : మండలం లోని గూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో గురువారం సీఐ సన్యాసినాయుడు సంకల్పం కార్యక్రమంపై విద్యార్థినులకు అవగాహనా కల్పించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ సంకల్పంతో విద్యార్థులు ముందుకు సాగాలని సీఐ అన్నారు. సమాజంలో విద్యార్థులకు ఫోక్స్ కేసుల గురించి ఆడవారి పైన జరుగుతున్న అఘాయిత్యాలు సైబర్ నేరాలు పై ఆయన అవగా హన కల్పించారు. డిఐజి ఎస్పీ ఆదేశాలమేరకు సంకల్పం ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా పాఠశాల లో సందర్శించి తనిఖీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. యాంటీ డ్రగ్ అవేర్నెస్ మీటింగ్ అను ప్రోగ్రాం గురించి వివరించడం క్లుప్తంగా వివరించడం జరిగింద న్నారు. డ్రగ్స్ వాడటం వలన ఎటువంటి అనర్థాలు జరుగుతాయి ఎటువంటి నేరాలు చేయుటకు దారితీస్తుంది వంటి వాటిని విషయాలను తెలియజేయడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులు ఏమైనా సమస్యలు వస్తే పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. హాస్టల్‌కి వెళ్ళినా భోజన ప్రమాణాలు ఎలా ఉన్నాయి, అని వంటగది భోజన సదుపాయాలు ఎలా ఉన్నాయి, వంటల రుచులు ఏ విధంగా ఉన్నాయి, నాణ్యమైన భోజనం పెడుతున్నారా లేదా మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా వంటి విషయాలను కూడా హెచ్ఎం ను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. ఎటువంటి సమయంలో ఉన్న ఏ ప్రాబ్లంలో ఉన్న పోలీసు వారిని సంప్రదించాలని ఆయన తెలపారు. పాఠశాల ఆవరణంలో సెక్యూరిటీ గార్డు ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఆడపిల్లలు స్కూలు కావడంతో ప్రతిరోజు ఈవినింగ్ పెట్రోలింగ్ కూడా చేయమని ఆదేశాలు జారీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ లక్ష్మీ ,పోలీస్ శాఖ సిబ్బంది. పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సకల సౌకర్యాలున్నా సమస్యల వలయంలో పెద్దాసుపత్రి

తెదేపా అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగభూషణం

విశాలాంధ్ర-చింతపల్లి : చింతపల్లి పెద్దాసుపత్రి పరిస్థితి అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్నట్లు తయారైందని తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ చింతపల్లి, జి కే వీధి మండలాలకు సంబంధించి చింతపల్లి పెద్దాసుపత్రిలో యంత్ర పరికరాలున్నా, మత్తు (ఎనస్తీసియా) వైద్యులు లేక ఎముకలు విరిగిన రోగులను జిల్లా కేంద్రమైన పాడేరు తరలిస్తూ స్థానిక వైద్యులు చేతులు దులుపుకుంటున్నారన్నారు. స్థానిక ఆసుపత్రిలో నిపుణులైన ఎముకల వైద్యులు ఉన్నప్పటికీ శస్త్ర చికిత్సలు చేసేందుకు మత్తు (ఎనస్తీసియా) వైద్యులు లేకపోవడం వలన ఎముకలు విరిగి ఆసుపత్రికి వచ్చిన రోగులను జిల్లా కేంద్రమైన పాడేరు తరలిస్తుండడం బాధాకరమన్నారు. చింతపల్లిలో 100 పడకల ఆసుపత్రి కి సరిపడిన సౌకర్యాలు, యంత్ర పరికరాలు ఉన్నప్పటికీ వాటిని సద్వినియోగపరిచేందుకు అవసరమైన మత్తు వైద్యాధికారి లేక ఎముకలు విరిగిన రోగులే గాక, శస్త్ర చికిత్సలు అవసరమైన ఇతర రోగులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు పూర్తి అయినప్పటికీ నేటికీ మన్య ప్రాంతంలో పరిస్థితులు మారలేదన్నారు. ఆసుపత్రిని అభివృద్ధి పరచేందుకు ప్రభుత్వాలు, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా, ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించే కొంతమంది వైద్యుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆయన ఆరోపించారు. గతంలో ఇద్దరు వైద్యులు ఉన్నప్పుడు అందిన సేవలు కూడా నేడు పదిమంది వైద్యులు ఉన్న అందని ద్రాక్షగా మారాయన్నారు. కరోనా సంక్షోభ సమయంలో ఆసుపత్రి సూపరిండెంట్ మహేశ్వర రావు సహా రఘురాం అనే ఇద్దరు వైద్యులు సమిష్టి కృషి చేసి అటువంటి విపత్కర పరిస్థితులను సైతం ఎదుర్కొన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అటువంటి ఈ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా చేసి నిపుణులైన వైద్యులను, సకల సౌకర్యాలను కల్పించినప్పటికీ ముఖ్యమైన మత్తు (ఎనస్తీసియా) వైద్యాధికారి లేక సమస్యలు తలెత్తుతున్నాయని, కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చింతపల్లి ఆసుపత్రిలో మత్తు వైద్యాధికారిని వెంటనే నియమించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

స్మగ్లర్ల కిల్లాగా ఇందుకూరు రేంజ్

అడ్డూ అదుపు లేకుండా కలప అక్రమ రవాణా చోద్యం చూస్తున్న అటవీ అధికారులు

విశాలాంధ్ర-దేవీపట్నం : ఇందుకూరు అటవీ రేంజ్ లో అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. స్మగ్లర్లు పట్ట పగలే చెట్లను నరికేస్తున్న పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. గోదావరి తీరం పాపికొండల నుంచి అటు పురోషోత్తపట్నం ఇటు గోకవరం వరకు ఇందుకూరు రేంజ్ అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. దీనిలో కొండమొదలు దేవీపట్నం పురుషోత్తపట్నం దామన్నపల్లి సెక్షన్లు ఇందుకూరు రేంజ్ పరిధిలోకి వస్తాయి. అయితే కొంతమంది అధికారులు స్మగ్లర్లను ప్రోత్సాహిస్తూ వారికి వెన్ను దన్నుగా నిలుస్తున్నారనే ఆరోపణలు గతం నుంచి ఉన్నాయి. అందుకు అనుగుణంగానే ప్రతియేటా స్మగ్లర్లు అడవుల్లో వృక్షం లను సైజు ముక్కలగా మార్చి వ్యాన్ లు ట్రాక్టర్లపై అటు సీతానగరం కోరుకొండ తొర్రేడు వంటి చోట్లకు తరలించేస్తుంటారు. అయినా ఇక్కడ సిబ్బంది నుంచి రేంజర్ వరకు కనీస స్థాయిలో స్పందిస్తున్న దాఖలాలు లేవు. ఇందుకూరు రేంజ్ పరిధిలోని ప్రతి యేటా రూ.కోటి నుంచి రెండు కోట్ల రూపాయలు పైబడి మారుజాతి కలపను తరలించేస్తారని అంచనా. ఇక అనుమతులు లేకుండా టేకు కలపను కూడా తరలించుకు పోతున్న అధికారులు నిమ్మకు నీరేతినట్టు వ్యవహరిస్తారని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ప్రతియేటా అధికారులకు లక్షలాది రూపాయల ముడుపులు రూపంలో అందు కుంటారని ఆరోపణలు దీన్నిబట్టి పై వ్యవహారం బలం చేకూరుతుంది.

టేకు దొంగలను పట్టుకోరా...? ఇందుకూరు రేంజ్ పరిధిలోకొచ్చే చిన రమణయ్య పేట పరిధిలో సుమారు 70టేకు చెట్లను స్మగ్లర్లు నరికి తరలించేశారు. వాటి విలువ సుమారు యాభై లక్షలకు పైగా ఉంటుందని అంచనా. అయితే పదిహేను రోజులు అవుతున్నా అధికార్లు ఈ వ్యవహారాన్ని తేలిగ్గా తీసుకోవటం పలు అనుమానాలకు తావిస్తుంది. ఈ వ్యవహారం లో అధికారులుకు సదరు స్మగ్లర్లకు అవగాహన కుదర బట్టే వ్యవహారం సాఫీ గా నడిచిందని అంటున్నారు. అయితే ఈ వ్యవహారాలపై పత్రికల్లో కథనాలు వస్తున్న అధికారులు తేలు కుట్టిన దొంగల్లా ఉన్నారని అంటున్నారు. ఈ వ్యవహారం లో సమగ్ర విచారణ జరిపి టేకు దొంగలతో పాటు అండగా నిలిచిన టేకు దొంగలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అరకులోయ డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

విశాలాంధ్ర-అరకులోయ : అరకు లోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విశాఖపట్నం నెహ్రూ యువ కేంద్రం వారి సౌజన్యంతో కళాశాలలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కలిగిస్తూ క్లీన్ ఇండియా గ్రీన్ ఇండియా అనే అద్భుతమైన పెయింటింగ్ ను వేయించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ భరత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ ఇటువంటి పెయింటింగ్స్ ద్వారా యువతలో మరింత స్వచ్ఛతాహి సేవ పై అవగాహన ఏర్పడుతుందని అన్నారు. కళాశాలలో తృతీయ సంవత్సరం బీఎస్సీ సిబిజెడ్ చదువుతున్న లోకోయి జగన్నాథం ఈపెయింటింగ్‌ను చిత్రీకరించినట్లు ఎన్ఎస్ఎస్ పిఓలు పి.నాగబాబు, వై.విజయ లక్ష్మి, ఎం.అనితకుమారి తెలియజేశారు. ఈ విద్యార్థిని ప్రిన్సిపల్ అధ్యాపకులు అభినందించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.పుష్పరాజు, ఐక్యుఎసి కోఆర్డినేటర్ డాక్టర్ పి.కొండబాబు, అధ్యాపకులు ఎల్ఎంఎస్ గణేష్, బి.లచ్చన్న, వి.కామేశ్వరరావు, ఎస్.అప్పారావు, కె.సునీల్, కె.అంబికా, కె.భవాని, ఎస్.దొన్ను, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రైలులో గుండె పోటుతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-బెలగాం : రైలులో గుండె పోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం లద్ద- పార్వతీపురం రైల్వేస్టేషన్ ల మధ్య చోటు చేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయగడ నుండి విజయనగరం వెళ్తున్న బంగారి సన్యాసిరావు (57)కు గుండెపోటు రావడంతో రైలులో మృతి చెందారు. గమనించిన తోటి ప్రయాణీకులు రైల్వే పోలీసులకు సమాచారం అందచేశారు. స్పందించిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని అతని కుటుంబ సభ్యులకు అప్పగించి రాయగడ తరలించారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కోసం మెటా సేఫ్టీ క్యాంపెయిన్

విశాలాంధ్ర-పాడేరు : రోజురోజుకి పెరుగుతున్న ఆన్లైన్ మోసాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకుగాను మెటా ఈరోజు తన సేఫ్టీ క్యాంపెయిన్ 'స్కామ్స్ సే బచోను ప్రారంభించింది మరియు ఆన్‌లైన్ స్కామ్‌ల నుండి ఎలా సురక్షితంగా ఉండాలో మరియు సురక్షితమైన డిజిటల్ పద్ధతులను ఎలా ప్రచారం చేయాలో ప్రజలకు తెలియజేయడానికి బాలీవుడ్ స్టార్ ఆయుష్మాన్ ఖురానాతో భాగస్వామ్యం చేసుకుంది. ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (మేటి), ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖ సహకారంతో ప్రారంభించబడిన మెటా ప్రచారం దేశంలో పెరుగుతున్న స్కామ్‌లు మరియు సైబర్ మోసాల కేసులను ఎదుర్కోవడానికి ప్రభుత్వ లక్ష్యానికి మద్దతునిస్తూ ఆన్‌లైన్‌లో ప్రజలను రక్షించడానికి కంపెనీ నిబద్ధతను నొక్కి చెబుతుంది. ఎడ్యుకేషనల్ క్యాంపెయిన్ ప్రజలు వారి దైనందిన జీవితంలో ఎదుర్కొనే అత్యంత సాధారణ స్కామ్‌లలో కొన్నింటిని ప్రదర్శిస్తుంది, ఏదైనా చర్య తీసుకునే ముందు ప్రజలను అప్రమత్తంగా ఉండమని మరియు జాగ్రత్తగా ఉండమని ప్రోత్సహిస్తుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మరియు వాట్సాప్‌లలోని సేఫ్టీ ఫీచర్‌ల హోస్ట్‌ను ఈ చిత్రం మరింత హైలైట్ చేస్తుంది, ఇది వినియోగదారులకు వారి ఆన్‌లైన్ భద్రతను నియంత్రించే గొప్ప అవకాశాన్ని అందిస్తుంది.

పల్లె పండుగ కార్యక్రమం నిర్వహణ

విశాలాంధ్ర-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం పుల్లంగి పంచాయతీలో సర్పంచ్ జాన్ విక్టర్ ఆధ్వర్యంలో గురువారం పల్లె పండుగ కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికిగాను గ్రామాలు అభివృద్ధి చేయుటకై పుల్లంగి పంచాయతీకి ప్రభుత్వం నుండి 1.03 లక్ష రూపాయల నిధులను విడుదల చేసింది. కనుక పంచాయతీ లో నూతనంగా గోకులం షెడ్స్, పండ్లతోట అభివృద్ధి, పంటకాలువలు పునరుద్ధరణ వంటి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి కిషోర్ బాబు, సచివాలయం సిబ్బంది, ఎన్ఆర్‌జిఎస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించడం లేదు...

దుంబ్రిగుడ: ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని ఖండ్రుమ్ పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి ఆరోపించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆ పంచాయితీలోని ఒంబిలో డబ్ల్యుబిఎం రోడ్డును గురువారం అధికారులు, కూటమి నాయకులు ప్రారంభించారన్నారు. అయితే స్థానిక సర్పంచ్ కు ఆహ్వానించకుండా కూటమి నాయకులే ప్రారంభించుకున్నారని చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణానికి వైయస్సార్ ప్రభుత్వం హయంలోనే డబ్ల్యు బి ఏం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. అధికారిక కార్యక్రమంలో కూటమి నాయకులే కాకుండా స్థానిక పంచాయతీ ప్రజాప్రతినిధులు కూడా గౌరవించి ఆహ్వానించాలని ఆయన కోరారు.

ఈనెల 22 నుండి విశ్వశాంతి శ్రీమద్ భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞ కార్యక్రమాలు

విశాలాంధ్ర-సీతానగరం : మండల కేంద్రంలోని సువర్ణముఖినది ప్రక్కనగల శ్రీవేణుగోపాలస్వామి, శ్రీలక్ష్మీనారసింహ స్వామి దేవాలయాల ప్రాంగణంలో ఈనెల 22 నుండి 29వరకువారం రోజుల పాటు విశ్వశాంతిశ్రీమద్ భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు తెలియజేశారు. పనసలవలస శ్రీవైష్ణవఆచార్యపీఠం పరం పరాగత పీఠాధిపతి శ్రీమత్త రుమల రంగనాథం అయ్యాంవార్ల ప్రత్యక్ష పర్యవేక్షణలోను, శ్రీమాన్ పీసపాటి రామానుజాచార్యులు బ్రహ్మోత్సవమున జరుగుతాయని తెలిపారు. మనలో దాగి ఉన్న అజ్ఞాన అంధకారములను తొలగించి సకల దోషములను పోగొట్టి విజ్ఞాన దీపజ్యోతిలను వెలిగించి భా-గ-వ-త అను 4 అక్షరములకు భక్తి, జ్ఞాన, వైరాగ్య సాక్షాత్ కారములే నిర్వచనాలని అందరికీ మోక్షమార్గం చూపే మహోన్నతపురాణమే శ్రీమత్ భాగవతమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు తమగోత్రనామాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. వారంరోజులు పాటు జరిగే ఈకార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకొని మోక్షమార్గంను పొందగలరని తెలిపారు. మరిన్ని వివరాలకు 9705566717 నెంబరుకు సంప్రదించాలన్నారు.

పార్వతీపురం రూరల్ ఎస్సై దినకర్‌ను వీఆర్‌కు బదిలీ

ఎస్ఐగా సంతోష్‌కుమారికి బాధ్యతలు

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతిపురం గ్రామీణ ప్రాంతంలో ఫోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న పార్వతీపురం గ్రామీణ ఎస్సై వి.దినకర్‌కు విఆర్‌కు బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురం పట్టణ స్టేషన్లో ఎస్సైగా పనిచేస్తున్న వి.సంతోష్ కుమారిని పార్వతీపురం గ్రామీణ ఎస్ఐగా బదిలీచేస్తూ ఈఉత్తర్వులలో పేర్కొన్నారు.

మృతికి కారణమైనవారిని శిక్షించాలి : తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు డిమాండ్ పార్వతీపురం మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన యువకుడుని ఫోక్స్ కేసులో స్టేషన్‌కు తీసుకెళ్లిన తర్వాత మరుసటిరోజు రైల్వే ప్లాట్ ఫారంపై మృతి చెందగా తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు బంధువులు పెద్ద ఎత్తున పార్వతీపురంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇది ముమ్మాటికి హత్యని,ఈఛావుకు కారణమైన వారిని అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేస్తూ వారి ధర్నా చేపట్టారు. ఎస్ఐపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంవరకు వెళ్లి అక్కడ కూడా నిరసన కార్యక్రమాన్ని వ్యక్తంచేశారు. పార్వతీపురం సబ్ డివిజన్ పోలీస్ అధికారి సురాన అంకిత కలెక్టరేట్ వద్దకు చేరుకుని వారితోమాట్లాడి న్యాయం చేస్తామని, మృతదేహానికి పోస్టుమార్టం చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారికి నచ్చచెప్పారు. అనంతరం వారంతా జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ గోడును వినిపించారు. జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేయగా, దీనిపై జిల్లా ఎస్పీకి నివేదిస్తానని, న్యాయం చేస్తామని చెప్పారు. దర్యాప్తునిర్వహించి తగు న్యాయం చేస్తానని కలెక్టర్ తెలియజేయడంతో వారుపోస్టుమార్టం చేసేందుకు అంగీకరించారు.

ప్రభుత్వ పథకాలను అర్హులకు అందేలా కృషి చేయాలి : ఎమ్మెల్యే శిరీష దేవి

విశాలాంధ్ర-గంగవరం : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కులయిన లబ్ధిదారులందరికీ అదేవిధంగా కృషి చేయాలని సచివాలయ సిబ్బందికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి సూచించారు. గురువారం మండలంలోని లక్కొండ గ్రామ సచివాలయాన్ని అమె అకస్మకంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బంది హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు కొత్తగా వచ్చే పింఛన్ అప్లికేషన్ తీసుకొని వచ్చే జనవరి నాటికి కొత్తవారికి పింఛన్లు అందించే విధంగా సిద్ధంగా ఉండాలని సచివాలయ సిబ్బందికి సూచించారు సచివాలయ భవనాన్ని త్వరగా పూర్తిచేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఉన్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు విజయ భాస్కర్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు కుంజం సిద్దు, ఉపాధ్యక్షులు గవరాజు సచివాలయ సిబ్బంది పాల్గొనగా ఎస్సై డిభూషణం ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది భద్రతా చర్యలు చేపట్టారు.

స్వచ్ఛ మన్యం జిల్లాయే లక్ష్యం : ప్రత్యేక పర్యవేక్షణాధికారి నల్లనయ్య

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : స్వచ్ఛమైన మన్యం జిల్లా లక్ష్యమే తక్షణ కర్తవ్యం అని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ప్రత్యేక పర్యవేక్షణాధికారి పి.నల్లనయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్ర శివారులోగల డంపింగ్ యార్డును ప్రజారోగ్య ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జ్యోతితో పాటు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డులోని పర్యావరణానికి హానీ కలిగించే ప్లాస్టిక్ తదితర వ్యర్థ పదార్థాలను తరలించేందుకు విశాఖపట్నానికి చెందిన తరుణ్ అసోషియేట్స్ తో ప్రజారోగ్యశాఖ ఒప్పందం కుదుర్చుకుందన్నారు. జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ, శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పలాస కాశీబుగ్గ మున్సిపాల్టీల్లో వ్యర్థ పదార్థాలను తరలింపుకు సంబందించి తరుణ్ అసోషియేట్స్ తో ఒప్పందం కుదర్చడం జరిగిందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో డంపింగ్ యార్డులోని వ్యర్థాల తరలింపుకు సంబంధించి 100ఐ200 స్థలం కేటాయించాలని,40 కెవి ట్రాన్స్ ఫార్మర్, బోర్ ఏర్పాటు చేయాలని, సంబంధిత ఇంజనీరింగ్ శాఖ డిఈ కిరణ్ తో పాటు ఆ శాఖాధికారులను కోరడం జరిగిందన్నారు. స్వచ్ఛంధ్ర ప్రదేశ్ కార్పోరేషన్ ద్వారా ఆయా మున్సిపాల్టీల్లో గల డంపింగ్ యార్డుల్లోని పర్యావరణానికి హాని కలిగించే వ్యర్థాల తరలింపుకు సంబందించి తరుణ్ అసోషియేట్ కు టన్నుకు వెయ్యి రూపాయలు చొప్పున చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి కమిషనర్ సన్యాసిరావు, డిప్యూటీ ఇంజనీర్ కిరణ్ కుమార్, సానిటరీ ఇన్స్పెక్టర్ కెవిపి రాజు పలువర సిబ్బంది పాల్గొన్నారు.

మొండిగడ్డ పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమం

విశాలాంధ్ర-జీకే వీధి : కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న, పల్లె పండుగ కార్యక్రమం లో భాగంగా మండలంలో ప్రతి పంచాయతీల్లో పనులు ప్రారంభమయ్యాయి. గూడెం కొత్త వీధి మండలం మొండిగడ్డ పంచాయతీలో గురువారం పల్లె పండగ కార్యక్రమం స్థానిక సర్పంచ్ ఆడప ప్రియాంక ,కూటమి నాయకులు ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమం పంచాయతీలో, ఫారం ఫాండ్ ఉపాధి హామీ పథకం ద్వారా భూమి పూజ చేసి పనులు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ అడప ప్రియాంక మాట్లాడుతూ గత ఆగస్టు నెల 23వ తేదీన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ,ద్వారా పలు పనులను పంచాయతీలో తీర్మానించడం జరిగిందని ఈ పల్లె పండుగ కార్యక్రమంలో పనులు ప్రారంభమై అన్నారు సిసి రోడ్లు, డ్రైనేజీ, భూమి చదును,మొక్కలు, పశు నిరోధక, కంధకాలు, పశువులు షెడ్లు ,కోళ్ల ఫారాలు, అనేక పనులు ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడం జరుగుతుందని దీన్ని ఉపాధి హామీ పథకం కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి కీలక నిర్ణయాలు తీసుకోవడం మంచి శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో గబులంగి హరిబాబు, అడపా సత్తిబాబు, పోత్తూరు విష్ణుమూర్తి జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి., లింగమూర్తి, మత్స్యరాజు వీరబాబు నరేంద్ర, ఉపాధి హామీ పథకం అధికారులు సచివాలయం సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.